• కేసీఆర్ సార్‌కు అభివాదం

ఎల్కతుర్తి సభలో యువకుడి కేరింత

• గులాబీ కండువాతో..

అభిమాన నేతను చూసేందుకు వచ్చి పరవశించిన యువతులు

• జై బాపు.. జై కేసీఆర్

కేసీఆర్ చిత్రపటాన్ని ప్రదర్శిస్తున్న మహిళ

• అప్పుడే మంచిగుండె సారూ..

కేసీఆర్ పాలనే బాగుందని ప్లకార్డు ప్రదర్శిస్తున్న అభిమానులు

• అపురూప చిత్తరువు

కేసీఆర్-శోభ దంపతుల చిత్తరువును ప్రదర్శిస్తున్న కార్యకర్తలు

ఏమి జనం.. సంచలనం

బీఆర్ఎస్ రజతోత్సవ సభలో కార్యకర్తల ఆనందహేల

ఎల్కతుర్తి సభలో కేసీఆర్ ప్రసంగిస్తుండగా చేతులెత్తి మద్దతు ప్రకటిస్తున్న ప్రజానీకం

మొదటిపేజీ తరువాయి...

వదిలేసి పంట పొలాల మీదుగా నడుచుకుంటూ సభా వేదిక వద్దకు చేరుకున్నారు. కేవలం గంట వ్యవధిలో మరో 5 లక్షల మంది పోగయ్యారు. మొత్తానికి 10 లక్షల మందికి పైగా సభికులతో సభా ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ఆ సమయంలో డ్రోన్ కెమెరా ద్వారా సభా వేదిక పరిసరాలను గమనిస్తే.. పుట్ట పగిలి చీమలు బారులు తీరినట్టు జనం సాగుతూ కనిపించారు. కేసీఆర్ ప్రసంగం మొదలయ్యే సమయానికి మసక చీకటి అయింది. ఆయన ప్రసంగం వినాలనే ఆకాంక్షతో జనం ఆత్రుతతో పరుగులు పెట్టిన సందర్భంలో పంట పొలాల్లో ఉన్న కంపదార చెట్లకు చర్మం గీరుకుపోయి రక్తాలు కారాయి. కొందరికి బట్టలు చిరిగాయి. బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సంబురాల వేళ వరంగల్ జిల్లా ఎల్కతుర్తి సభా వేదిక పరిసర ప్రాంతాల్లో కనిపించిన దృశ్యాలు ఇవి.

అత్యధికులు 45 ఏండ్లలోపు వారే..

ఎండ తీవ్రత దృష్ట్యా వృద్ధులు, మహిళలను సభకు తీసుకురావద్దని స్వయంగా కేసీఆరే తమ పార్టీ నేతలకు సూచించినట్టు తెలిసింది. మహిళలు, వృద్ధులు వారి వారి గ్రామాల్లోనే ఉండి, టీవీల ద్వారా బహిరంగ సభ ప్రత్యక్ష ప్రసారం చూస్తూ.. ప్రసంగం వినే విధంగా సూచన చేయాలని పార్టీ నేతలకు సూచించినట్టు సమాచారం. దీంతో సభ వద్ద మహిళల సంఖ్య స్వల్పంగానే కనిపించింది. నిజానికి సభకు వస్తామన్న మహిళలను ప్రోత్సహించి ఉంటే ఎల్కతుర్తి సభా ప్రాంగణం ఏ మాత్రం సరిపోకపోయేదని నిర్వాహకులు అంటున్నారు. కానీ, పార్టీ నేతల అంచనాకు అందనంతగా తరలివచ్చిన యువత, రైతులు సభకు ఆకర్షణగా నిలిచారు. ఎల్కతుర్తికి తరలివచ్చిన జనసందోహంలో 70 శాతం మంది యువత 45 ఏండ్లలోపు వాళ్లే ఉండటం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఆనందంలో ముంచెత్తింది. 'బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు సాంకేతిక నైపుణ్యానికి హైదరాబాద్ కేరాఫ్ అడ్రస్. హైదరాబాద్ సాంకేతిక ఎడ్యుకేషన్ హబ్‌గా రూపాంతరం చెందింది. పొరుగు రాష్ట్రాల నుంచి యువత ఉపాధి, ఉద్యోగావకాశాలు వెతుక్కుంటూ వచ్చారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన నాటి నుంచి ఈ 16 నెలల కాలంలో సాంకేతిక ఉత్పత్తుల ఎగుమతులు లేకపోవడంతో సాఫ్ట్‌వేర్ కంపెనీలు కాస్ట్ కటింగ్ అమలు చేస్తున్నాయి. లక్షల మంది ఉద్యోగాలు పోతున్నాయి' అని హైదరాబాద్‌లోని ప్రముఖ కంపెనీలో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రవి ప్రతాప్ పేర్కొన్నారు. 'బీఆర్ఎస్ ప్రభుత్వంలో తాను రోజుకు రూ.1,200 సంపాదించేవాడిని. డీజిల్ ఖర్చులు, ఆటో కిరాయి పోనూ రూ.600 మిగులుబాటు ఉండేది. కుటుంబ అవసరాలకు వెల్లుబాటు అయింది. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వచ్చినంక రోజుకు రూ.300 కూడా ఎల్లుబాటు కావటం లేదు' అని రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలం బాలాజీ నగర్‌కు చెందిన ఆటో కార్మికుడు రమేష్ నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు.

అవును.. నిజమే...

సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కేసీఆర్ విరుచుకుపడినప్పుడు సభకు వచ్చిన ప్రతి ఒక్కరూ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. 16 నెలలుగా అస్తవ్యస్త విధానాలతో, అసమర్థ పాలనతో కాంగ్రెస్ తెచ్చిన కారుచీకట్ల నడుమ నలుగుతున్న ప్రజలకు కేసీఆర్ కొండంత ఆశాజ్యోతిగా కనిపించిండు. రైతుబంధు ఇవ్వడంలో, కరంటు, ఎరువులు, విత్తనాల సరఫరా, ధాన్యం కొనుగోళ్లలో కాంగ్రెస్ ఫెయిల్ అయ్యిందని కేసీఆర్ చెప్పినప్పుడు రైతులు 'అవును' అని ముక్తకంఠంతో ఒప్పుకొన్నారు. సరిగ్గా ఏడాదిన్నర కిందటి వరకు 24 గంటల కరంటు, సమయానికి రైతుబంధు, సరిపడా ఎరువులు, విత్తనాలతో గుండెల మీద చెయ్యి వేసుకొని తాము బతికిన రోజులను గుర్తుచేసుకున్నారు. 'కల్లం కాడికే వచ్చి వడ్లు కొనుక్కపోయిన రోజులు పోయినయి' అంటూ బాధపడ్డారు. చెప్పుడు మాటలు నమ్మి నిండా మునిగామంటూ ఆవేదన చెందారు. భూముల ధరలు ఎటుపోయినయని కేసీఆర్ ప్రశ్నించినప్పుడు రైతులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, ఏజెంట్లలో దుఃఖం పొంగుకొచ్చింది. అక్కర కోసం అమ్మబోతే సగం ధర పడిపోయిన పరిస్థితి గుర్తుకొచ్చి రైతులు, వ్యాపారం పడిపోయి, పెట్టుబడులు ఇరుక్కుపోయి ఏండ్ల కష్టం బూడిదపాలైందంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారులు కండ్లల్లో నీళ్లు తిప్పుకున్నారు. 20-30 శాతం కమీషన్లు తీసుకునుడు, సంచులు నింపుడు, ఢిల్లీకి మోసుడులో ప్రభుత్వం పాస్ అయ్యిందని చెప్పగానే చోటా, బడా కాంట్రాక్టర్లు, మాజీ సర్పంచులు, ఇతర ప్రజాప్రతినిధులు ఒక్కసారిగా తమ పరిస్థితి, బిల్లుల కోసం తాము పడ్డ నరక యాతనను, తిన్న లాఠీ దెబ్బలను, ఇచ్చిన కమీషన్లను గుర్తుతెచ్చుకున్నారు. 'కేసీఆర్ కిట్, ఒమ్మ ఒడి వంటి పథకాలను లక్షాధికారుల కోసం పెట్టినమా?.. పేదల కోసం పెట్టినం.. మరి ఎందుకు నిలిపివేశారు' అంటూ కేసీఆర్ నిలదీసినప్పుడు సభకు వచ్చిన ఆడబిడ్డలు 'మా కోసం మా అన్న ప్రశ్నిస్తున్నడు' అని ధైర్యం తెచ్చుకున్నరు. 'కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ కింద తులం బంగారం ఇస్తున్నరా?' అని అడిగినప్పుడు గతంలో ఠంఛనుగా పడే లక్ష నూటాపదహార్లు కూడా ఇప్పుడు వస్తలేవని బాధపడ్డారు. 'హెచ్‌సీయూ భూములను ఎట్లా అమ్ముతరు? విచక్షణ ఉండొద్దా?' అంటూ గర్జించినప్పుడు సభకు వచ్చిన యువతరం చప్పట్లతో, విజిళ్లతో హోరెత్తించింది. ఇవి మచ్చుతునకలు మాత్రమే. ఎల్కతుర్తి సభలో కేసీఆర్ మాట్లాడిన ప్రతి మాట ప్రజల గుండెల్లోకి దూసుకుపోయింది. 2014 కు ముందు పరిస్థితులు, పదేండ్ల కేసీఆర్ పాలనలో అందివచ్చిన సౌకర్యాలు, 16 నెలల కాంగ్రెస్ పాలనలో అనుభవిస్తున్న కష్టాలు కండ్ల ముందు కదలాడాయి. అసమర్థ పాలన ఫలితంగా నలుగుతూ గుండెల నిండా భారంతో వచ్చిన లక్షలాది మందికి.. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని కేసీఆర్ ఇచ్చిన హామీతో ప్రాణం లేచి వచ్చినట్టయ్యింది. ఆ సమయంలో లక్షలాది మంది ముఖాల్లో సంతోషం పొంగిపొర్లింది. 'తెలంగాణ ప్రజలకు కేసీఆర్ ఒక వ్యక్తి మాత్రమే కాదు.. ఒక ఎమోషన్' అని మరోసారి రుజువైంది.

పడగొట్టాలే సారు..

కేసీఆర్ ప్రసంగం సభికులను ఆకట్టుకున్నది. కార్యకర్తల్లో జోష్ నింపింది. కేసీఆర్ ప్రసంగంతో సభికులు కనెక్ట్ అయ్యారు. ఈ సందర్భంలోనే కేసీఆర్ మాట్లాడుతూ.. 'మా దుబ్బాక ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో ఈ ప్రభుత్వాన్ని ఇంకా మూడేండ్లు భరించాలని ఎవరో అంటే.. అదే మాటను ఆయన విలేకర్లకు చెప్పిండు. ఇగ చూస్సిర్రా మా గవర్నమెంట్‌ను పడగొడుతరంట అని అంటున్రు.. మేం ఎందుకు పడగొడుతాం రా భాయ్.. మాకేమన్న కాళ్లు చేతులు గులగుల పెట్టినయా.. మేం ఆ కిరికిరి పని చెయ్యం.. బిడ్డా మీరు ఉండాలే' అని కేసీఆర్ చెప్పినప్పుడు.. వేదిక దగ్గర ఉన్న ముల్కనూరు గ్రామానికి చెందిన రైతు ఎల్లయ్య 'కేసీఆర్ సారు... ఇంకా మూడున్న రేండ్లు సర్కారుంటే రైతులం బతుకం' అనుకుంటా రెండు చేతులు ఎత్తి దండం పెట్టి అడగగా.. సభికులు ఆయనకు వంతపాడారు. రైతు వ్యాఖ్యలను పట్టుకున్న యువకులు 'సీఎం.. సీఎం' అంటూ నినదించటంతో కేసీఆర్ కొంత అసహనానికి గురయ్యారు. కేసీఆర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమం ఇవ్వటంలో ఫెయిల్ అయిందని చెప్పారు. ఆ తర్వాత 'మంచినీళ్లు అందించటంలో' అనగానే జనం 'ఫెయిల్' అంటూ ప్రతిస్పందించారు. కరెంటు సరఫరాలో అని కేసీఆర్ చెప్పగానే 'ఫెయిల్' అంటూ జనం ముక్తకంఠంతో అందుకున్నారు. దాన్యం కొనుగోళ్లలో..'ఫెయిల్' అంటూ ప్రతిస్పందించారు. ఈ సమయంలోనే దామెర గ్రామానికి చెందిన సంగమ్మ అనే మహిళ 'తులం బంగారం ఇయ్యటంలో ఫెయిల్' అనటంతో కేసీఆర్ ఆమె మాటను అందుకొని కల్యాణలక్ష్మి పథకం గురించి ప్రస్తావించారు. ప్రసంగాన్ని కొనసాగిస్తూ.. 'మరి దేంట్లే పాస్ అయింది?' అని కేసీఆర్ అడగగానే.. జనంలో నుంచి ఓ మహిళ ఆడోళ్లను జుట్లు జుట్లు పట్టించటంల పాసయ్యిందని గట్టిగా అనటంతో సభలో నవ్వులు విరిశాయి. కేసీఆర్ ప్రభుత్వం వస్తేనే వ్యవసాయం బాగుపడుతుందని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇట్లనే కొనసాగితే రైతులు బతకరు.. అని ఎల్కతుర్తికి చెందిన రైతు చిన రాములు ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన తన మూడు ఎకరాల భూమిని సభ నిర్వహణకు ఇచ్చినట్టు చెప్పారు.

కేసీఆర్ ప్రకటనను స్వాగతిస్తున్నాం

పౌరహక్కుల సంఘం హర్షం

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): కేంద్రం 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలంటూ బీఆర్ఎస్ రజతోత్సవ సభలో ఆ పార్టీ అధినేత కేసీఆర్ డిమాండ్ చేయడాన్ని స్వాగతిస్తున్నట్టు పౌరహక్కుల సంఘం తెలిపింది. మావోయిస్టులతో చర్చలు జరపాలంటూ కేంద్రానికి లేఖ రాస్తానని ప్రకటించడంపై పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు సోమవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. తెలంగాణలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడిగా ఆపరేషన్ కగార్ అంశంలో బలమైన పోరాటాలు కొనసాగించాలని, హత్యాకాండకు ముగింపు పలికేలా చొరవ తీసుకోవాలని కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. మావోయిస్టు పార్టీ నెల క్రితమే చర్చల ప్రక్రియకు సంసిద్ధతను బహిరంగంగా ప్రకటించిన విషయాన్ని కేసీఆర్ దృష్టిలో ఉంచుకొని కేంద్రాన్ని ఒప్పించే దిశగా అడుగులు వేయాలని కోరారు. తెలంగాణ ఉద్యమంలో ఎలాగైతే సబ్బండవర్ణాలు కదిలి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకున్నామో, మధ్యభారతంలో కొనసాగుతున్న ఆదివాసీల హననాన్ని నిలువరించడానికి తెలంగాణ ప్రజలు ముందుకు రావాలని కోరారు. బీజాపూర్ జిల్లా అటవీ ప్రాంతాల్లోని ఆదివాసీలను పోలీసులు అక్రమంగా అరెస్టు చేశారని,వారిని వెంటనే విడుదల చేయాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, కార్యదర్శి నారాయణరావు డిమాండ్ చేశారు.

కర్రెగుట్టలపై దాడులు ఆపాలి

ములుగు, ఏప్రిల్ 28(నమస్తే తెలంగాణ): అటవీ సంపదను దోచుకునేందుకు చేపట్టిన ఆపరేషన్ కగార్‌ను తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ, దళిత, గిరిజన, ప్రజాసంఘాల సమన్వయ కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ములుగు జిల్లా కేంద్రంలో సోమవారం మీడియా సమావేశంలో వారు మాట్లాడారు. కర్రెగుట్టలపై వారంరోజులుగా చేస్తున్న బలగాల దాడులు ఆపాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ ప్రకటనతో రాజకీయ ప్రకంపనలు!

- మరోసారి తెరపైకి వచ్చిన మావోయిస్టులతో చర్చల అంశం
- స్వాగతించిన హక్కుల నేతలు
- ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా గళం విప్పుతున్న మేధావులు
- అన్ని పార్టీలూ స్పందించాల్సిన స్థితిని సృష్టించిన కేసీఆర్
- రాష్ట్ర ప్రభుత్వంలోనూ కదలిక!

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలని, మావోయిస్టులతో చర్చలు జరపాలంటూ బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ సాక్షిగా, లక్షలాది ప్రజల సమక్షంలో ఆ పార్టీ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కేంద్రాన్ని చేసిన డిమాండ్ రాజకీయ పార్టీల్లో ప్రకంపనలు సృష్టించింది. 'ఆపరేషన్ కగార్' పేరిట మావోయిస్టులతోపాటు ఛత్తీస్‌గఢ్‌లోని అమాయక ఆదివాసీలను భద్రతా బలగాలు కాల్చిచంపుతున్నాయనే ఆరోపణలు ఉన్నా, దేశవ్యాప్తంగా ఇతర పార్టీలేవీ బహిరంగంగా స్పందించడం లేదు. దీనిపై వామపక్ష పార్టీల నేతలు, పౌరహక్కుల నేతలు స్పందిస్తున్నప్పటికీ, గట్టిగా మాట్లాడితే 'అర్బన్ నక్సలైట్లు' ముద్ర వేస్తారనే భయం మేధావుల్లో సైతం లేకపోలేదు. 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలని, ప్రభుత్వంతో శాంతి చర్చలకు తాము సిద్ధంగా ఉన్నామని మావోయిస్టు పార్టీ ప్రకటించినప్పటికీ, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించలేదు. మావోయిస్టులను మట్టుబెట్టే కార్యక్రమాన్ని మరింత ముమ్మరం చేసింది. కర్రెగుట్టల్లో ఎన్‌కౌంటర్ దీనికి నిరద్శనం. ఈ నేపథ్యంలో కేసీఆర్ అత్యంత సాహసోపేతంగా 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలంటూనే మావోయిస్టులతో చర్చలు జరపాలనే డిమాండ్‌ను గట్టిగా వినిపించడం ద్వారా ప్రజాస్వామిక స్ఫూర్తిని ప్రదర్శించారనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కేసీఆర్ స్ఫూర్తితో ఆదివాసీలపై జరుగుతున్న అన్యాయాలపై మరింత బిగ్గరగా మాట్లాడేందుకు, 'ఆపరేషన్ కగార్'కు వ్యతిరేకంగా గట్టిగా నినదించేందుకు చాలా మంది ముందుకు వస్తున్న పరిస్థితి కనిపిస్తున్నది. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పార్టీ రజతోత్సవ సభలో మాట్లాడుతూ.. 'కేంద్రం ఆపరేషన్ కగార్ పేరుతో ఛత్తీస్‌గఢ్‌లో ఊచకోత కోస్తున్నది. అది ధర్మం కాదు. నక్సలైట్లు చర్చలకు సిద్ధమంటున్నరు. బలం ఉందని చంపుకుంటూ పోవడం ప్రజాస్వామ్యం కాదు. ఆపరేషన్ కగార్‌ను ఆపేయండి. నక్సలైట్లను పిలిచి చర్చలు జరపండి' అంటూ కుండబద్దలు కొట్టినట్టుగా మాట్లాడటం ద్వారా ప్రజాస్వామిక స్ఫూర్తిని ప్రదర్శించారని పలువురు కొనియాడుతున్నారు. కేసీఆర్ దేశ రాజకీయాలను మలుపు తిప్పారని, ఉద్యమకాలంలో చూపిన ప్రజాస్వామిక స్ఫూర్తినే మరోసారి చాటిచెప్పారనే భావన నెలకొన్నది. కేసీఆర్ ప్రకటనను స్వాగతిస్తున్నట్టు పౌరహక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నారాయణరావు ఒక ప్రకటన చేశారు.

ఆదినుంచీ కేసీఆర్‌ది అదే పంథా..

తెలంగాణ ఉద్యమ సమయంలోనూ కేసీఆర్ అనేక సందర్భాల్లో మావోయిస్టు పార్టీతో శాంతిచర్చలు జరపాలని నినదించారు. 2004 నుంచి 2014 వరకు కేంద్రంలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ సర్కారు హయాంలో దండకారణ్యం నెత్తురోడింది. సల్వా జుడుం, ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరిట మారణహోమాన్ని కొనసాగించింది. ఆదివాసీలతో పాటు తెలంగాణ బిడ్డలు ఎందరో నేలకొరిగారు. ప్రతి సందర్భంలోనూ, కాంగ్రెస్ చర్యలను కేసీఆర్ ఖండించడమే కాకుండా, తెలంగాణ ఏర్పాటు తరువాత ఒక్క ఎన్‌కౌంటర్ కూడా ఉండబోదని స్పష్టంచేశారు. మలి దశ ఉద్యమంలో అనేక సందర్భాల్లో కూడా తెలంగాణ ఏర్పాటు తరువాత అన్నల అజెండాను అమలు చేస్తామని బాహాటంగా ప్రకటించారు. అధికారంలోకి వచ్చాక అమలుచేసి చూపారు.

రాష్ట్ర ప్రభుత్వంపై ప్రభావం

మావోయిస్టులతో చర్చలు జరపాలంటూ కేంద్రాన్ని కేసీఆర్ చేసిన డిమాండ్.. ఇటు తెలంగాణ ప్రభుత్వం మీద కూడా తీవ్ర ప్రభావమే చూపినట్టు కనిపిస్తున్నది. ఒకవైపు రజతోత్సవ సభ సాక్షిగా శాంతిచర్చల డిమాండ్‌ను కేసీఆర్ ఎజెండా మీదకు తీసుకొని రావడం, పౌరహక్కుల నేతలు తనను కలిసి మావోయిస్టులతో కేంద్రంతో చర్చలు జరిపేందుకు ముఖ్యమంత్రిగా చొరవచూపాలని కోరిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ హోం మంత్రి జానారెడ్డితో సమావేశమయ్యారు. గతంలో వైఎస్ ప్రభుత్వ హయాంలో పీపుల్స్‌వార్ ప్రతినిధులతో చర్చలు జరిపిన అనుభవం ఉన్నందున అధిష్ఠానంతో సంప్రదింపులు జరపాలని జానారెడ్డిని కోరడం కేసీఆర్ ప్రకటన ఏ స్థాయిలో ప్రభావం చూపిస్తున్నదో స్పష్టం చేస్తున్నది.

• మావోయిస్టులతో చర్చలు జరపాలి

కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'ఆపరేషన్ కగార్'ను తక్షణమే నిలిపివేసి, మావోయిస్టులతో శాంతిచర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ కన్వీనర్, హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపకుండా ఆదివాసీలపై దమనకాండకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. ఇది సమంజసం కాదని పేర్కొన్నారు. 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలంటూ సోమవారం వివిధ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో నిర్వహించిన మీడియా సమావేశంలో జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ.. ఆదివాసీల హననాన్ని తక్షణమే ఆపివేయాలని డిమాండ్ చేశారు. ఆదివాసుల సంక్షేమం దృష్ట్యా ఇరుపక్షాలు శాంతిని పాటించాలని శాంతి చర్చల కమిటీ ఉపాధ్యక్షుడు జంపన్న కోరారు.

- ఉస్మానియా యూనివర్సిటీ, ఏప్రిల్ 28

శాంతి చర్చలు జరపండి

కేంద్ర, రాష్ట్రాలకు మావోయిస్టు పార్టీ లేఖ

కొత్తగూడెం ప్రగతి మైదాన్, ఏప్రిల్ 28: ఎలాంటి షరతులు లేకుండా శాంతి చర్చలు జరపాలంటూ మావోయిస్టు పార్టీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ పేరుతో సోషల్ మీడియాలో విడుదలైన లేఖ సంచలనం సృష్టించింది. 2024 జనవరి నుంచి కేంద్ర, రాష్ట్ర పోలీసులు, పారా మిలిటరీ, కమాండో బలగాలు ఆపరేషన్ 'కగార్' పేరుతో మావోయిస్టు విప్లవోద్యమ ప్రాంతాల్లో వందలాది మంది మావోయిస్టులను, అమాయక ఆదివాసీలను హత్య చేయడాన్ని ఖండిస్తూ.. దేశ వ్యాప్తంగా ప్రజాస్వామిక, విప్లవ ప్రజా సంఘాలు, మేధావులు ఉద్యమిస్తున్నారని లేఖలో పేర్కొన్నారు. తమ పార్టీ కేంద్ర కమిటీ ప్రభుత్వంతో శాంతి చర్చలకు సిద్ధమని మార్చి 28న ఒక ప్రకటన విడుదల చేసినట్టు గుర్తుచేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జార్ఖండ్ రాష్ట్రం బొకారోలో కేంద్ర కమిటీ సభ్యుడు వివేక్‌తోపాటు మరి కొందరిని హత్య చేసినట్టు తెలిపారు. తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు కర్రెగుట్ట ప్రాంతాల్లో 10 వేల మంది సాయుధ బలగాలతో దిగ్బంధించి, ఆరుగురు మావోయిస్టులను హత్యచేసిందని తెలిపారు. మారణకాండను వెంటనే నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు.

ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలి

- తక్షణమే మావోయిస్టులతో కేంద్రం చర్చించాలి: కవిత

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ):మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కేంద్రం చేపట్టిన 'ఆపరేషన్ కగార్'ను నిలిపివేయాలని ఎమ్మెల్సీ కవిత డిమాండ్ చేశారు. సోమవారం ఆమె జాతీయ మీడియాచానల్‌తో మాట్లాడు తూ.. నక్సలైట్లను అంతం చేయాలన్న పంతంతో బీజేపీ ముందుకెళ్తున్నదని, ఆ పంథా సరి కాదని వెంటనే మార్చుకోవాలని కేసీఆర్ సూచించారని చెప్పారు. ప్రజాస్వామ్యబద్ధంగా మావోయిస్టులను శాంతిచర్చలకు పిలిచి పరిష్కారాన్ని కనుక్కోవచ్చని రజతోత్సవ సభలో కేసీఆర్ చెప్పారని గుర్తుచేశారు.'గతంలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నక్సలైట్లను అంతం చేయడమే లక్ష్యంగా 'ఆపరేషన్ గ్రీన్‌హంట్' చేపట్టిందని, అది విజయవంతం కాలేదని పేర్కొన్నారు. ప్రస్తుతం కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 'ఆపరేషన్ కగార్' చేపట్టిందని, దీంతో ఛత్తీస్‌గఢ్‌లోని ఒక జిల్లాలో తీవ్రమైన ఆందోళన నెలకొన్నదని వివరించారు. గత పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో 3,500 పైచిలుకు నక్సలైట్లు లొంగిపోయి జనజీవన స్రవంతిలో కలిసిపోయారని తెలిపారు. 'కేంద్రం సానుకూల వాతావరణంలో మావోయిస్టులను చర్చలకు పిలవాలి. చర్చలకు మావోయిస్టులను పిలిచే క్రమంలో రెడ్‌కారిడార్‌లో ఉన్న రాష్ట్రాలను, రాజకీయ పార్టీలను సైతం పిలవాలి' అని కవిత సూచించారు.

చర్చలకు ప్రభుత్వం ఒత్తిడితేవాలి: రాఘవులు

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తేతెలంగాణ): ఆపరేషన్ కగార్‌ను నిలిపివేయాలని, వెంటనే శాంతి చర్చలు ప్రారంభించాలని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బీవీ రాఘవులు కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఆ దిశగా రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కారు కేంద్రంపై ఒత్తిడి తేవాలని కోరారు. సోమవారం సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ, సభ్యురాలు జ్యోతితో కలిసి మీడియాతో మాట్లాడుతూ.. దేశంలో హింసవు తావులేదని స్పష్టం చేశారు. ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలోని గనుల కోసమే మోదీ సర్కారు మావోయిస్టులను అంతమొందిస్తున్నదని రాఘవులు ధ్వజమెత్తారు.

మావోయిస్టులు వెంటనే లొంగిపోవాలి:ఐజీ

హైదరాబాద్, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): మావోయిస్టు పార్టీలో ఉన్న తెలంగాణవాసులంతా లొంగిపోవాలని మల్టీజోన్ ఐజీ-1 చంద్రశేఖర్‌రెడ్డి సూచించారు. తెలంగాణలో మావోయిస్టుల కదలికలేమీ లేవని, కర్రెగుట్టలో తెలంగాణ పోలీసులు ఎలాంటి కార్యకలాపాలను నిర్వహించట్లేదని సోమవారం మీడియాకు స్పష్టం చేశారు. కేంద్ర బలగాలు వెంకటాపురం ఏరియాలో బేస్‌క్యాంప్‌ను ఏర్పాటు చేసుకొని కూంబింగ్ చేస్తున్నాయని, తమకు ఎలాంటి సమాచారం లేదన్నారు. మావోయిస్టులు తెలంగాణలో ప్రవేశించకుండా గస్తీ కాస్తున్నట్టు తెలిపారు.

కర్రెగుట్ట అడవుల్లో 100కు పైగా ఐఈడీలు

ములుగు, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ): తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల కర్రెగుట్టను ఆపరేషన్ కగార్‌లో భాగంగా స్వాధీనం చేసుకునేందుకు భద్రతా బలగాలు ప్రయత్నం చేస్తున్నాయి. సోమవారం గాలింపు చర్యల్లో భాగంగా భద్రతా బలగాలకు బీరు బాంబులు, 100కు పైగా ఐఈడీలు లభ్యంకాగా వాటిని నిర్వీర్యం చేస్తూ లక్ష్యం దిశగా ముందుకు సాగుతున్నట్టు తెలిసింది. 250 కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న కర్రెగుట్టల్లో అనేక కొండలు, సొరంగాలు పోలీస్ బలగాలకు సవాల్‌గా మారుతున్నాయి. భద్రతా దళాలు హెలికాప్టర్లు, డ్రోన్ల సహాయంతో నిఘా పెట్టినప్పటికీ మావోయిస్టులు డెన్‌లను కనుగొనడం సవాల్‌గా మారింది.